

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -122 ఆదివారం 18 అక్టోబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

వయసు ఆధారిత ఆంక్షలు వద్దు



పిల్లల భద్రత, ఇంటర్నెట్ స్వేచ్ఛ రెండూ ముఖ్యమే: సుప్రీంకోర్టు

ఆన్‌లైన్ వేధింపుల నివారణకు కఠిన నిబంధనలు అమలు చేయాలి

రష్యా చమురుపై ఆంక్షలు ఎత్తివేసిన ట్రంప్



- భారత్, చైనాలకు ఊరట..

ఉక్రెయిన్ తీవ్ర ఆగ్రహం



బంగ్లాదేశ్ రిసార్టులో ఘోర అగ్నిప్రమాదం

- 10 మంది మృతి.. 9 మందికి గాయాలు
- మరికొందరి ఆచూకీ గల్లంతు

ఢాకా,అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త)::బంగ్లాదేశ్‌లోని ప్ర ముఖ పర్యాటక ప్రాంతం కాక్స్ బజార్‌లో ఘోర అగ్నిప్ర మా దం చోటుచేసుకుంది. ఇనానీ ప్రాంతంలోని పటువార్‌టెక్ బీచ్ సమీపంలో ఉన్న ఓ సముద్రతీర విడిది కేంద్రంలో శనివారం తెల్లవారుజామున మంటలు చెలరేగడంతో 10 మంది

మిగతా2లో...

రైతుల భూమికి భరోసా..

సాగునీటి ప్రాజెక్టుకు కొత్త ప్రతిపాదనలు!

- సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి తుమ్మల భేటీ
- పైపుల కాలువలతో 9,767 ఎకరాల భూమి ఆదా.. రూ.2,148 కోట్ల వ్యయం తగ్గించే అవకాశం



హైదరాబాద్,అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త):రైతుల భూములను కాపాడటంతో పాటు సాగునీటి ప్రాజెక్టుల వ్యయాన్ని తగ్గించడం, ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్తు ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పలు లేఖలు అందజేసి, సీతారామ ఎత్తిపోతల పథకంలో సాధ్యమైన ప్రాంతాల్లో పైపుల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. **రూ.2,148 కోట్ల వరకు ఆదా**సీతారామ ప్రాజెక్టు పంపిణీ కాలువలను పైపుల వ్యవస్థగా మార్చితే సుమారు 9,767 ఎకరాల భూమి ఆదా కావడంతో పాటు భూసేకరణ వ్యయంలో

మిగతా2లో...



విద్యార్థినులపై పోలీసుల దౌర్జన్యం సిగ్గుచేటు

- ప్రశ్నించే గొంతులను అణచివేసే కుట్ర జరుగుతోంది: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): ప్రజాస్వామ్యం కోసం గొంతెత్తిన విద్యార్థినులపై ఢిల్లీ పోలీసులు దౌర్జన్యానికి పాల్పడటం సిగ్గుచేటని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ విమర్శించారు. విద్యార్థులను

మిగతా2లో...

నీరు, విద్యుత్ పొదుపుగా వినియోగించాలి

- ఎల్‌నినో ప్రభావంతో మారుతున్న వాతావరణ పరిస్థితులు
- రాష్ట్రంలో విద్యుత్ అవసరం 20 వేల మెగావాట్లు:

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్,అక్టోబర్ 17 అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త):ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజలకు పిలుపునిచ్చారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ నీరు, విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అవసరమైన మేరకే వనరులను వినియోగిస్తూ వృథాను అరికట్టాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బతుకమ్మ యువ చిత్ర నిర్మాతల పురస్కారాల ప్రదానోత్సవంలో భట్టి విక్రమార్క పాల్గొని విజేతలకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన

మిగతా2లో...

గోదావరి – కావేరి అనుసంధానం ముసుగులో మరో కుట్ర!

తెలంగాణ జల హక్కులకు ముప్పు కలిగించే ప్రయత్నాలు: హరీశ్‌రావు ఆందోళన



హైదరాబాద్,అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త):గోదావరికావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టు పేరుతో తెలంగాణ నీటి ప్రయోజనాలకు నష్టం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం ప్రాజెక్టు మార్గాన్ని పోలవరం వైపు మళ్లించే ప్రయత్నం చేస్తోందని

మిగతా2లో...

ప్రకృతి ఆరాధనే బతుకమ్మ

- తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీక: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్,అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ ఆడపడుచులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆడపడుచులంతా బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. తెలంగాణ అస్తిత్వాన్ని

మిగతా2లో...

పర్యాటక కేంద్రంగా ఎల్లమ్మ చెరువు

హుస్నాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

గాజు వంతెన, గుట్టను పర్యాటక ప్రాంతాలుగా

తీర్చిదిద్దుతాం: మంత్రి పొన్నం ప్రభాకర్



క్లిష్ట పరిస్థితుల్లో బీజేపీకి విదేశీ నినాదమే ఆధారం!

- మోదీ పాలనలో ఏ వర్గానికీ న్యాయం జరగలేదు: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

వయసు ఆధారిత ఆంక్షలు వద్దు

న్యూఢిల్లీ,అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త)::ఇంటర్నెట్ వినియోగించుకునే హక్కు పెద్దలతో పాటు పిల్లలకూ ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వయసును ప్రాతిపదికగా తీసుకుని ఇంటర్నెట్ వినియోగంపై పూర్తిస్థాయి ఆంక్షలు విధించడం సమంజసం కాదని పేర్కొంది. ఇలాంటి పరిమితుల వల్ల పిల్లలు రహస్యంగా ఇంటర్నెట్‌ను వినియోగించే ప్రమాదం ఉందని, ఆన్‌లైన్‌లో వేధింపులు లేదా బెదిరింపులు ఎదురైనా తల్లిదండ్రులకు చెప్పేందుకు వెనుకాడే అవకాశం ఉందని అభిప్రాయపడింది.జస్టిస్ జె.బి. పార్థీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఇంటర్నెట్ సృజనాత్మక వ్యక్తీకరణకు, సమాచార మార్పిడికి, విద్యాభ్యాసానికి ఉపయోగపడుతుందని పేర్కొంది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని పిల్లలకు, ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారులకు ఆన్‌లైన్ వేదికలు ఎంతో సహాయపడుతున్నాయని తెలిపింది. అదే సమయంలో పిల్లలను ఆన్‌లైన్ లైంగిక వేధింపుల నుంచి రక్షించాల్సిన అవసరాన్ని ధర్మాసనం గుర్తుచే సింది. హానికరమైన సమాచారాన్ని గుర్తించి తొలగించడంలో సామాజిక మాధ్యమ వేదికలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించింది. పిల్లల ఖాతాల భద్రత కోసం ప్రత్యేకంగా ‘బాలల భద్రతా విధానం’ ప్రవేశపె ట్టడం మంచిదని అభిప్రాయ పడింది. చిన్నా రులకు ఇంటర్నెట్ సదుపాయాన్ని పూర్తిగా నిరాకరించడం కాకుండా, వారి భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. సురక్షితమైన డిజి టల్ వాతావరణం కల్పించేందుకు సామాజిక మాధ్య మాల్లో లైంగిక వేధింపులకు సంబంధించిన సమా చారాన్ని తొలగిం చేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని పేర్కొంది.

పర్యాటక కేంద్రంగా ఎల్లమ్మ చెరువు

సిద్దిపేట,అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త):హుస్నాబాద్ పట్టణంలోని చారిత్రక ఎల్లమ్మ చెరువును ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. చెరువుతో పాటు గాజు వంతెన, సమీపంలోని గుట్టను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఎల్లమ్మ చెరువు వద్ద చేపట్టిన సుందరీకరణ పనులు, పండుగ ఏర్పాట్లను మంత్రి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. పండుగకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.హుస్నాబాద్ నియోజకవర్గాన్ని పర్యాటకం, విద్య, వైద్యం, క్రీడలు, రహదారులు, సాగునీటి రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. పట్టణానికి కబడ్డీ అకాడమీతో పాటు ఈత కొలను కూడా మంజూరైనట్లు చెప్పారు.2007లో శంకుస్థాపన చేసిన గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన అడ్డంకులు తొలగిపోయాయని, ప్రస్తుతం కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ జరుగుతోందని వివరించారు. ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి వెల్లడించారు.ఎల్లమ్మ చెరువు అభివృద్ధితో హుస్నాబాద్ ప్రాంతానికి పర్యాటకంగా మరింత గుర్తింపు రావడంతో పాటు స్థానికంగా ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఆరోగ్యంపై దృష్టి సారించాలి.. క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి: మంత్రి శ్రీధర్‌బాబు

వరంగల్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం.. త్వరలో విమానాశ్రయం, హనుమకొండలో ఐటీ టవర్



హనుమకొండఅక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త)::యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. వ్యాయామం, క్రీడలు, ధ్యానం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను పొందవచ్చని తెలిపారు.నాయిని విశాల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. జాతీయ సాంకేతిక విద్యాసంస్థ నుంచి హయగ్రీవాచారి మైదానం వరకు జరిగిన ఈ పరుగులో 5, 10, 21 కిలోమీటర్ల విభాగాలను ఏర్పాటు చేశారు. యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు.హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా వరంగల్ నిలుస్తోందని శ్రీధర్‌బాబు అన్నారు. వరంగల్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. త్వరలో వరంగల్ విమానాశ్రయాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని, హనుమకొండలో ఐటీ టవర్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి, యువతకు తగిన అవకాశాలు కల్పించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూమికి భరోసా.. సాగునీటి ప్రాజెక్టుకు కొత్త ప్రతిపాదనలు!

(మొదటి పేజీ తరువాయి)

రూ.2,148.74 కోట్ల వరకు తగ్గింపు సాధ్యమవుతుందని మంత్రి అంచనా వివరించారు. ఈ పథకం ద్వారా మొత్తం 6.74 లక్షల ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. భూముల సేకరణతో రైతులకు ఇబ్బందులు కలగకుండా, పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.**ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్తు ప్రమాదాల నివారణ**ఆయిల్‌పామ్ చెట్ల ఆకులు, కొమ్మలు విద్యుత్తు తీగలకు తగలడం వల్ల సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు ఏర్పడుతున్నాయని మంత్రి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 11 కేవీ విద్యుత్తు లైన్లకు కవర్డ్ కండక్టర్లు, అవసరమైన చోట తక్కువ వోల్టేజీ లైన్లకు ప్రత్యేక కేబుళ్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కొత్త, పాత తోటల్లో దశలవారీగా మార్పులు చేపట్టేందుకు రాష్ట్రస్థాయి ఉమ్మడి విధానం రూపొందించాలని కోరారు.**దుమ్ముగూడెం వద్ద నీటి నిల్వకు చర్యలు**దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఇసుక బస్తాలతో తాత్కాలికంగా నీటిని నిల్వ చేసి సుమారు ఒక టీఎంసీ నీటిని వినియోగించుకునే అవకాశాన్ని మంత్రి వివరించారు. సుమారు రూ.30 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టవచ్చని తెలిపారు. దీనివల్ల సాగు, తాగునీటి అవసరాలకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. **ఖమ్మం అభివృద్ధికి నిధులు కోరిన మంత్రి**ఖమ్మం నగరంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ, తాగునీటి పథకాలకు సంబంధించిన నివేదికలను ఆమోదించి నిధులు విడుదల చేయాలని మంత్రి కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే యాతాలకుంట టన్నెల్ పనులను త్వరగా పూర్తి చేసి సత్తుపల్లి, వేంసూరు, అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలని కోరారు.

నీరు, విద్యుత్ పొదుపుగా వినియోగించాలి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ, గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రంగా ఉండేదని, ప్రస్తుతం అందుకు భిన్నంగా వాతావరణ పరిస్థితులు మారుతున్నాయని తెలిపారు. ఒకప్పుడు చలి నుంచి రక్షించుకునేందుకు జాగ్రత్తలు తీసుకునేవారని, ప్రస్తుతం వేడి నుంచి కాపాడుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.వాతావరణంలో వస్తున్న మార్పులు ప్రజల జీవన విధానంపై ప్రభావం చూపుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో నీరు, విద్యుత్ వంటి కీలక వనరులను బాధ్యతాయుతంగా వినియోగించడం అవసరమని తెలిపారు.రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ అవసరం 20 వేల మెగావాటాలకు చేరిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు విద్యుత్‌ను అనవసరంగా వినియోగించకుండా పొదుపు చర్యలు పాటించాలని సూచించారు. నీటిని కూడా వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వినియోగించాలని పిలుపునిచ్చారు.

క్లిష్ట పరిస్థితుల్లో బీజేపీకి విదేశీ నినాదమే ఆధారం!

హైదరాబాద్, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త):క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడల్లా విదేశీ అంశాలను తెరపైకి తీసుకురావడం బీజేపీకి అలవాటుగా మారిందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. గత పదమూడేళ్లుగా ఇదే ధోరణి కొనసాగుతోందని, ప్రస్తుతం బంగ్లాదేశ్ అంశాన్ని కూడా అదే విధంగా ప్రస్తావిస్తున్నారని ఆరోపించారు.శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ వృత్తి నిపుణుల విభాగం అధ్యక్షుడు మధు యాష్కీలతో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్ విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశంలోని ఏ వర్గానికీ న్యాయం జరగలేదని ఆయన విమర్శించారు. దేశభక్తి గురించి మాట్లాడే బీజేపీ నాయకులు భారత భూభాగంలోకి చైనా చొచ్చుకొచ్చినప్పుడు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.**ఎన్నికల సంఘంపై విమర్శలు**ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేశ్‌కుమార్ నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం నియామక వ్యవస్థలో మార్పులు చేసిందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరుస్తున్న కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘాన్ని ఉపయోగించుకుని మైనారిటీలు, గిరిజనులు, లౌకికవాదుల ఓట్లను తొలగిస్తోందని విమర్శించారు.తెలంగాణలోనే 27 శాతం ఓట్లు తొలగించారని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్రలో ఎన్నికల ఫలితాల్లో మూడు నెలల వ్యవధిలో గణనీయమైన మార్పు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు.

బంగ్లాదేశ్ రిసార్టులో ఘోర అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాణాలు కోల్పోగా, మరో తొమ్మిది మంది గాయపడ్డారు. మరికొందరి ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళన నెలకొంది.మంటలు వేగంగా వ్యాపించడంతో మూడు అంతస్తుల కలప భవనం పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ సుమారు 30 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. కొందరు ప్రాణాలతో బయటపడగా, మిగతావారి పరిస్థితిపై స్పష్టత రావాల్సి ఉంది.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను గుర్తించేందుకు అవసరమైన నమూనాలను సేకరించనున్నట్లు అధికారులు వెల్లడించారు.అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. వంటగదిలో మంటలు చెలరేగడం లేదా విద్యుత్ లోపం కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నప్పటికీ, దర్యాప్తు పూర్తయ్యే వరకు నిర్ధారణకు రాలేమని అధికారులు తెలిపారు.

విద్యార్థినులపై పోలీసుల దౌర్జన్యం సిగ్గుచేటు

(మొదటి పేజీ తరువాయి)

భయభ్రాంతులకు గురిచేసి, వారు మరోసారి ప్రశ్నించకుండా చేయడమే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు.విద్యార్థులతో మాట్లాడిన సందర్భంగా వారు వెల్లడించిన విషయాలను రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో పంచుకున్నారు. పోలీసుల దాడుల్లో తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, దుస్తులు లాగడం, శరీరంలోని వ్యక్తిగత భాగాలను తాకడం వంటి చర్యలకు పాల్పడ్డారని బాధిత విద్యార్థినులు తనకు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని రాహుల్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ఉద్దేశించి విమర్శలు చేశారు. యువత, మహిళలపై పోలీసుల హింస ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు.ఈ ఘటనపై సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. అయితే, విద్యార్థినులు చేసిన ఆరోపణలపై అధికారికంగా వెలువడే వివరాలు, దర్యాప్తు ఫలితాలు కీలకం కానున్నాయి.

ప్రకృతి ఆరాధనే బతుకమ్మ

(మొదటి పేజీ తరువాయి)

చాటిచెప్పే ఈ పండుగ ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తుందని తెలిపారు. పూలతో బతుకమ్మను అలంకరించి, పాటలు పాడుతూ సంప్రదాయబద్ధంగా జరుపుకునే ఈ వేడుకలు మన సంస్కృతీ వైభవాన్ని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

సీజేపీ నేత అభిజీత్ దీప్కేకు బెయిల్

- **ఏడాది పాటు శాంతిభద్రతలకు భంగం కలిగించరాదని షరతు**
- **నిరసన ప్రదర్శనకు వెళ్తుండగా నిర్బంధం.. నేహా బోరా కూడా విడుదల**

న్యూఢిల్లీ,అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు ఢిల్లీలోని ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ శనివారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో నిర్వహించిన ‘లెట్రో దో తిరంగా’ నిరసన ప్రదర్శనలో పాల్గొనేందుకు వెళ్తుండగా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.ముందస్తు చర్యల్లో భాగంగా దీప్కేపై కేసు నమోదు చేసి, మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఏడాది పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడబోనని హామీ ఇస్తూ పూచీకత్తు సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి నిర్బంధం అవసరం లేదని పేర్కొంటూ షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.ఇదే నిరసన ప్రదర్శనలో పాల్గొన్న అఖిల భారత విద్యార్థి సంఘం అధ్యక్షురాలు నేహా బోరాను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శనివారం ఉదయం ఆర్‌కే పురం పోలీస్‌స్టేషన్ నుంచి ఆమెను విడుదల చేశారు.

గోదావరికావేరి అనుసంధానం ముసుగులో మరో కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. దీనివల్ల తెలంగాణకు దక్కాల్సిన గోదావరి జలాల వాటాపై ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.గోదావరికావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టుపై నవంబర్ 3న ఢిల్లీలో జాతీయ జల అభివృద్ధి సంస్థ సమావేశం జరగనున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని హరీశ్‌రావు కోరారు. రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలగకుండా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణకు రావాల్సిన గోదావరి జలాల వాటాపై స్పష్టత వచ్చిన తర్వాతే నదుల అనుసంధాన ప్రాజెక్టుపై ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. రాష్ట్ర సాగునీటి ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు.**గోదావరి జలాల వాటాపై స్పష్టత అవసరం** తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాను పరిరక్షిం చేందుకు ప్రభుత్వం కృషి చేయాలని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నదుల అనుసంధాన ప్రతిపాదనలను పరిశీలించాలని సూచించారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- **సమగ్ర భూ సర్వేపై మంత్రి పొంగులేటి సమీక్ష**
- **భూ యజమానులకు ముందస్తు నోటీసులు ఇవ్వాలి.. పారదర్శకంగా సర్వే చేపట్టాలి**



హైదరాబాద్,అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త)::తెలంగాణ రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వేపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భూ సర్వేలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, సర్వే ప్రారంభించే ముందు భూ యజమానులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా మూడు దశల్లో భూ సర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. తొలి దశలో ఇప్పటికే 2,720 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, వచ్చే నెలాఖరులోగా మొదటి దశను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులు నిర్ణయించి, ప్రతి సర్వే నంబరుకు ప్రత్యేక భూదార్ గుర్తింపు సంఖ్య కేటాయించనున్నట్లు చెప్పారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూములను కొలిచి, వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరచడంతో పాటు భూభారతి అంతర్జాల వేదికలో నమోదు చేస్తామని తెలిపారు. సర్వేకు సంబంధించి భూ యజమానులకు అభ్యంతరాలు ఉంటే స్వీకరించి పరిశీలిస్తామని స్పష్టం చేశారు.ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములు, గ్రామకంఠాల సరిహద్దుల విషయంలో స్పష్టత ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
ఆదివారం 18 అక్టోబర్ 2026

సద్దుల బతుకమ్మ, దసరాకు ఏర్పాట్లు పూర్తి

వర్ధన్నపేట రంగలీల మైదానంలో సర్వం సిద్ధం





వర్ధన్నపేట/అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని రంగలీల మైదానంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి తెలిపారు. పండుగలను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. పారిశుధ్యం, వీధి దీపాలు, విద్యుత్ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. పట్టణ ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై ప్రవీణ్‌కుమార్‌కు సన్మానం



వర్ధన్నపేట/అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సబ్‌ఇన్‌స్పెక్టర్ భోగం ప్రవీణ్‌కుమార్‌ను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, వర్ధన్నపేట ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నాంపెల్లి రవీందర్, కాంగ్రెస్ మండల నాయకుడు కొండేటి మధుకర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైకి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

రూ.34 లక్షల కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ





వర్ధన్నపేట/అక్టోబర్ 17(జర్నలిస్ట్ వార్త): అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. వర్ధన్నపేట క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు రూ.34,03,944 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం సాయం అందిస్తోందన్నారు. ఇదిలా ఉండగా, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్‌పర్సన్ శిబారాణి రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా అనిల్‌రెడ్డి



వర్ధన్నపేట/అక్టోబర్ 17(జర్నలిస్ట్ వార్త): గ్రేటర్ వరంగల్ రెండో డివిజన్ పరిధిలోని వంగపహాడ్ పీఏసీఎస్ చైర్మన్‌గా నియమితులైన అనిల్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును హనుమకొండలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్, కమిటీ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రైతుల సంక్షేమానికి, సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పుట్ట తిరుపతి, ఉపాధ్యక్షుడు రవీందర్, మాజీ చైర్మన్ మెరుగు రాజేష్‌గౌడ్, పీఏసీఎస్ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభించిన ఎర్రబెల్లి

క్రీడాకారులతో కలిసి బ్యాటింగ్ చేసిన మాజీ మంత్రి





వర్ధన్నపేట/అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని డీసీ తండా యువకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా క్రికెట్ ఆడుతూ యువకులను ఉత్సాహపరిచారు. అనంతరం ఇరు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకుని, టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో పండుగలు, ఆటపాటలతో సందడిగా ఉండేవన్నారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి, పోటీల నిర్వహణకు ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో క్రీడా ప్రాంగణాలు కనుమరుగవుతున్నాయని, వ్యవసాయం, విద్య, వైద్యం, క్రీడారంగాలు దెబ్బతిన్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ, మండల నాయకులు, డీసీ తండా ప్రజలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్

అధ్యక్షుడిగా సర్వన్ ధరావత్



వర్ధన్నపేట/అక్టోబర్ 17(జర్నలిస్ట్ వార్త): పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఇల్లంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు సర్వన్ ధరావత్ ఎన్నికయ్యారు. నల్లగొండలో నిర్వహించిన సంఘం ఆరో రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యాయ సంఘంలో 32 ఏళ్లుగా సేవలందిస్తున్న తనను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు సర్వన్ తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకరి భిక్షంగౌడ్, బట్టాపురం మధుసూదన్‌రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈదునూరి రవీందర్‌రెడ్డి, నకిరెడ్డి మహేందర్, వర్ధన్నపేట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మనుజేందర్‌రెడ్డి, అశోక్‌తోపాటు శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహాలక్ష్మి అవతారంలో దుర్గామాత

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాగరాజు






వర్ధన్నపేట/ అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పట్టణంలో దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం దుర్గామాత మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరిపై అమ్మవారి కృపాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

బతుకమ్మలో కులవివక్షకు తావేది?

దళిత మహిళల పట్ల వివక్ష ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి

బాధ్యులుగా తేలిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి: తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్



భీమదేవరపల్లి/అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): తెలంగాణ సంస్కృతి, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో కులవివక్షకు తావుండకూడదని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా టి.రేపాక గ్రామంలో బతుకమ్మ వేడుకల సందర్భంగా దళిత మహిళల పట్ల కులవివక్షకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. విచారణలో ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.
కొత్తకొండ గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రకాష్ మాట్లాడుతూ, బతుకమ్మ వంటి సాంస్కృతిక పండుగలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించాలే తప్ప కులాల పేరుతో విభజనలకు కారణం కాకూడదన్నారు. పండుగలో పాల్గొనే ప్రతి మహిళకు సమాన గౌరవం, సమాన హక్కులు ఉండాలని పేర్కొన్నారు. టి.రేపాకలో చోటుచేసుకున్నట్లు చెబుతున్న ఘటనపై వాస్తవాలను వెలికితీసి, బాధిత మహిళలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

భారత రాజ్యాంగంలోని 17వ అధికరణం అంటరానితనాన్ని నిషేధించిందని ప్రకాష్ గుర్తుచేశారు. ప్రతి పౌరుడికి సమానత్వం, గౌరవంతో జీవించే హక్కులు రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. కులం పేరుతో వివక్ష చూపినట్లు ఫిర్యాదులు అందితే సంబంధిత అధికారులు వాటిని నిష్పక్షపాతంగా పరిశీలించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలు, ఆధారాల ఆధారంగా నేరం జరిగినట్లు నిర్ధారణ అయితే వర్తించే చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టంలోని నిబంధనలు వర్తించే పరిస్థితులు ఉన్నాయా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని డిమాండ్ చేశారు.

వివక్షకు ముగింపు పలకాలి

స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా సమాజంలో కులవివక్షకు సంబంధించిన ఆరోపణలు వెలుగులోకి రావడం ఆందోళనకరమని ప్రకాష్ అన్నారు. అణగారిన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణలు ఆచరణలోనూ అమలుకావాలని పేర్కొన్నారు. రిజర్వేషన్లపై చర్చించే వారు సామాజికంగా వెనుకబడిన వర్గాలు ఎదుర్కొంటున్న అసమానతలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. బతుకమ్మ పండుగలో మహిళలందరూ కులమత భేదాలు లేకుండా పాల్గొనే వాతావరణం కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. టి.రేపాక ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధితుల వాదనలను పరిగణనలోకి తీసుకుని, నిజాలు వెలుగులోకి తీసుకురావాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం తరఫున ప్రభుత్వాన్ని కోరారు.
ఈ సమావేశంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తందూరి ఎల్లయ్య, బహుజన్ రాష్ట్ర కార్యదర్శి కండె సుధాకర్, కట్కూర్ గ్రామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

ఖమ్మం డీసీసీబీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ



ఖమ్మం/అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఖమ్మం ప్రధాన కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పూల పండుగ బతుకమ్మ వేడుకలు బ్యాంకు కార్యాలయంలో ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు కలెక్టర్‌తో పాటు బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యుడు పి. శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు బతుకమ్మ పండుగ విశిష్టతను వివరిస్తూ, తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ వెంకటాదిత్య, డీజీఎంలు ఉదయశ్రీ, వేణుగోపాల్, సర్వేశ్వరరావుతో పాటు ఇతర అధికారులు, బ్యాంకు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. పరస్పర సంతోషాల నడుమ బతుకమ్మ వేడుకలను నిర్వహించి, ఉద్యోగుల మధ్య ఐక్యతను చాటుకున్నారు.

అన్నారుగూడెంలో మహా అన్నదానం ప్రారంభించిన మువ్వా విజయబాబు



తల్లాడ/అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో రామాలయం వద్ద అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు శనివారం ప్రారంభించారు. గురుస్వాములు గోవిందు శ్రీనివాసరావు (ట్రాక్టర్), గోవిందు సురేష్ ఆధ్వర్యంలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న మువ్వా విజయబాబుకు సీనియర్ నాయకులు, గ్రామ ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) సాదర స్వాగతం పలికారు. అనంతరం గురుస్వాములు ఆయనను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావులను మువ్వా విజయబాబు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కూచిపూడి వెంకటేశ్వరరావు, పొన్నం కృష్ణయ్య, ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ యాకుబ్ పాషా, గోవిందు నరసింహారావు, తాళ్లూరి ఆదినారాయణ, కందుల నారాయణ, కొత్తపల్లి దానయ్య, పిన్ని హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వంగపహాడ్ పీఏసీఎస్ చైర్మన్‌గా అనిల్ రెడ్డి

నూతన చైర్మన్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



హసన్‌పర్తి/అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ పరిధిలోని వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా అనిల్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా హనుమకొండలోని తన నివాసంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును అనిల్ రెడ్డి, పీఏసీఎస్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన చైర్మన్ అనిల్ రెడ్డితో పాటు కమిటీ సభ్యులను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శాలువాలతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతుల సంక్షేమానికి, సహకార సంఘం అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం పీఏసీఎస్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ అధ్యక్షుడు పుట్ట తిరుపతి, ఉపాధ్యక్షుడు రవీందర్, మాజీ చైర్మన్ మెరుగు రాజేష్ గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు రాజు, పీఏసీఎస్ కమిటీ సభ్యులు గండు అశోక్, ఎంజాపురి రాములు, కొండ రాజు, సముద్రాల సూర్యనారాయణ, కోరె సరోజన, మేరగుట్టి సూరయ్య, మెరుగు రాధిక, పొన్నాల రాధ, పోలాది రామ్‌రెడ్డి, కన్నెబోయిన రాజు, బండి శంకరయ్య, రేమిడి సాంబరెడ్డి, డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి పోలీస్ ఆపన్నహస్తం

అనాథలైన చిన్నారుల కుటుంబానికి ఆర్థిక సాయం.. దాతలు ఆదుకోవాలని విజ్ఞప్తి

ఎల్కతుర్తి/అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త):
అనారోగ్యంతో మృతి చెందిన ఆటో డ్రైవర్ జంగం రాజు కుటుంబానికి ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆలీ మహమ్మద్ ఆపన్నహస్తం అందించారు. ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన జంగం రాజు కిడ్నీ సంబంధిత సమస్యలు, ఇతర అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 19 రోజుల క్రితం మృతి చెందాడు. దీంతో భార్య, చిన్న వయసులో ఉన్న ఇద్దరు పిల్లలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో రోజువారీ అవసరాలు తీర్చుకోవడం కూడా కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆలీ మహమ్మద్ శనివారం జంగం రాజు కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి భార్య, పిల్లలకు ధైర్యం చెప్పి, వారి అవసరాల కోసం రూ. 3 వేల విలువైన నిత్యావసర వస్తువులను అందజేశారు.
ఇలాంటి క్లిష్ట సమయంలో ఆ కుటుంబానికి మరింత మంది దాతలు అండగా నిలవాలని ఆలీ మహమ్మద్ విజ్ఞప్తి చేశారు.



చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని దాతలు తమకు తోచిన సహాయం అందిస్తే ఆ కుటుంబానికి కొంత ఆర్థిక భరోసా కలుగుతుందని పేర్కొన్నారు

గోపాలపేటలో హ్యాండ్‌బోర్ ఏర్పాటు

ఎంపీ నిధులతో బోరు మంజూరు.. ఎమ్మెల్యే చొరవతో పనులు పూర్తి



తల్లాడ/అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): తల్లాడ మండల పరిధిలోని గోపాలపేట గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమీపంలో హ్యాండ్‌బోర్ ఏర్పాటు చేశారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సహకారంతో, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చొరవతో ఎంపీ నిధుల నుంచి హ్యాండ్‌బోర్ మంజూరు కాగా, శనివారం బోరు వేయించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తాళ్ల సుధారాణి, ఉపసర్పంచ్ శనక్కాయల సత్యనారాయణ, కార్యదర్శి ఉషారాణి, నున్న పెద్ద తిరుమలరావు, కొమ్మినేని శ్రీనివాసరావు, ఫీల్డ్ ఆఫీసర్ అగస్టీన్, గ్రామ దీపికలు, గ్రామ పెద్దలు, పిల్లలు ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సద్దుల బతుకమ్మకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ విరాళం



రాయపర్తి/అక్టోబర్ 17(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొండాపురం గ్రామంలో సద్దుల బతుకమ్మ సందర్భంగా నిర్వహించే మహా అన్నదాన కార్యక్రమానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి 150 కిలోల బియ్యం, 15 కిలోల నూనె, రూ.5 వేల నగదు విరాళంగా అందజేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు ఈ సహాయం అందించారు. ఈ కార్యక్రమాన్ని మండల పార్టీ నాయకులు లేతకుల రంగారెడ్డి, గారె నర్సయ్య, చందు రాము, పోగులకొండ వేణు, సంకినేని ఎల్లస్వామి, చందు లక్ష్మణ్, ఐత జంపి ప్రారంభించగా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామ పరిశుభ్రతే లక్ష్యం..

సిబ్బంది సేవలకు గుర్తింపుగా నూతన వస్త్రాలు!

వేలేరు మేజర్ గ్రామపంచాయతీలో 18 మంది సిబ్బందికి పండుగ కానుకలు పంపిణీ

వేలేరు/హనుమకొండ బ్యూరో అక్టోబర్ 17 (జర్నలిస్ట్ /వార్త):
గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిత్యం శ్రమించే పారిశుద్ధ్య, గ్రామపంచాయతీ సిబ్బంది సేవలకు గుర్తింపుగా వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి ముందడుగు వేశారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న 18 మంది సిబ్బందికి నూతన వస్త్రాలను పంపిణీ చేసి పండుగ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత కోసం సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉంటేనే ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడంలో సిబ్బంది పాత్ర కీలకమని, వారి శ్రమను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పండుగ వేళ సిబ్బందిలో



ఆనందాన్ని నింపాలనే ఉద్దేశంతో 18 మందికి నూతన వస్త్రాలు అందించినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధిలో సిబ్బంది భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సమన్వయంతో



పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు.
ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



సద్దుల బతుకమ్మ..

తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక!

ప్రకృతిని పూజిస్తూ.. పూలతో పేర్చిన సంస్కృతి వైభవం

చెరువుల ఒడ్డున సందడి.. ఆటపాటలతో ఆడపడుచుల ఆనందోత్సాహం



జర్నలిస్ట్ వార్త /ప్రత్యేక కథనం

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే పండుగ బతుకమ్మ. ప్రకృతిని పూల రూపంలో ఆరాధిస్తూ, ఆడబిడ్డల ఆత్మీయతను చాటుతూ, తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను సజీవంగా నిలుపుతున్న అపురూపమైన పండుగ ఇది. తొమ్మిది రోజులపాటు పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ, ఆటలాడుతూ సంబరాలు జరుపుకునే తెలంగాణ మహిళలు.. చివరి రోజైన సద్దుల బతుకమ్మను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఇది కేవలం పూల పండుగ మాత్రమే కాదు.తెలంగాణ ఆడబిడ్డల జీవనశైలి, కుటుంబ అనుబంధాలు, ప్రకృతి ప్రేమ, సామూహిక ఐక్యతకు ప్రతిబింబం.

పూలలో ప్రకృతి సోయగం.. బతుకమ్మలో తెలంగాణ వైభవం

తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మను అందంగా పేర్చడం ఈ పండుగలో ప్రత్యేక ఆకర్షణ. ప్రకృతిలో సహజంగా లభించే పూలకు ప్రాధాన్యమిస్తూ, వాటిని వరుసలుగా పేర్చి మధ్యలో గౌరమ్మను ప్రతిష్ఠించి మహిళలు భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ప్రతి పువ్వులో ప్రకృతి అందాన్ని, ప్రతి పాటలో తెలంగాణ జీవనాన్ని, ప్రతి అడుగులో సంప్రదాయాన్ని ఆవిష్కరిస్తారు. పల్లెల్లోని వాకిళ్లు, వీధులు, ఆలయ ప్రాంగణాలు, చెరువుల పరిసరాలు బతుకమ్మ వేడుకలతో కళకళలాడుతాయి. కొత్త చీరలు ధరించిన మహిళలు, చిన్నారులు బతుకమ్మల చుట్టూ చేరి లయబద్ధంగా చప్పట్లు కొడుతూ పాటలు పాడటం పండుగకు ప్రత్యేక శోభను తీసుకొస్తుంది.

సద్దుల బతుకమ్మ.. తొమ్మిది రోజుల సంబరాలకు ముగింపు

ఆశ్వయుజ మాసంలో జరుపుకునే బతుకమ్మ పండుగలో చివరి రోజైన సద్దుల బతుకమ్మకు విశేష ప్రాధాన్యం ఉంది. ఈ రోజున మహిళలు పెద్ద బతుకమ్మలను సిద్ధం చేసి, పసుపుతో గౌరమ్మను తయారుచేసి పూజలు నిర్వహిస్తారు. అనంతరం బతుకమ్మలను సమీపంలోని చెరువులు, నీటి వనరుల వద్దకు తీసుకెళ్లి సామూహికంగా వేడుకలు జరుపుకుంటారు. సంప్రదాయబద్ధంగా పూజలు చేసి బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు.

సద్దుల బతుకమ్మ సందర్భంగా సద్దులు, ప్రసాదాలను తయారుచేసి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో పంచుకుంటారు. ఈ పండుగలో ఆహారాన్ని పంచుకోవడం కేవలం ఆచారం మాత్రమే కాదు.. పరస్పర ప్రేమాభిమానాలకు, ఆత్మీయతకు ప్రతీక.

ఆడబిడ్డల అనుబంధానికి ఆత్మీయ వేదిక

వివాహం చేసుకుని అత్తవారింటికి వెళ్లిన ఆడబిడ్డలు సైతం బతుకమ్మ పండుగకు పుట్టింటికి చేరుకోవడం తెలంగాణలో ప్రత్యేకత. చిన్ననాటి స్నేహితులు, అక్కాచెల్లెళ్లు, బంధువులు ఒకచోట చేరి బతుకమ్మ ఆడుతూ తమ అనుబంధాలను గుర్తుచేసుకుంటారు. కుటుంబ సభ్యుల మధ్య దూరాలను తగ్గించి, మనసులను దగ్గర చేసే పండుగగా బతుకమ్మ నిలుస్తోంది.

పల్లె నుంచి పట్టణం వరకు, సాధారణ కుటుంబాల నుంచి ఉన్నత వర్గాల వరకు మహిళలందరూ ఒక్కచోట చేరి జరుపుకునే ఈ వేడుక సమానత్వానికి సైతం ప్రతీకగా నిలుస్తుంది. కులమతాలకు అతీతంగా సామూహికంగా పాల్గొనడం ద్వారా తెలంగాణ సమాజంలోని ఐక్యత, సోదరభావం ప్రస్ఫుటమవుతాయి.

జానపద పాటల్లో జీవన సత్యాలు

బతుకమ్మ పాటల్లో దేవతల కథలే కాకుండా కుటుంబ బంధాలు, అక్కాచెల్లెళ్ల అనుబంధాలు, పల్లె జీవనం, వ్యవసాయం, ప్రకృతి అందాలు, మహిళల ఆశలు, ఆకాంక్షలు ప్రతిధ్వనిస్తాయి. పెద్దలు పాడిన పాటలను చిన్నతరం నేర్చుకుంటూ ముందుకు తీసుకెళ్లడం వల్ల తెలంగాణ జానపద సంపద తరతరాలకు అందుతోంది. ఆధునిక జీవనశైలి ప్రభావం పెరుగుతున్నప్పటికీ బతుకమ్మ పండుగ తన ప్రత్యేకతను కోల్పోకుండా కొనసాగడం విశేషం.

ప్రకృతి పరిరక్షణకు సందేశం

బతుకమ్మ పండుగ ప్రకృతితో మానవ జీవనానికి ఉన్న విడదీయలేని సంబంధాన్ని గుర్తుచేస్తుంది. పూలు, చెట్లు, నీటి వనరుల ప్రాధాన్యాన్ని చాటుతుంది. అయితే పండుగ నిర్వహణలో పర్యావరణ బాధ్యతను కూడా గుర్తించాలి. సహజసిద్ధమైన పూలను ఉపయోగించడం, ప్లాస్టిక్ అలంకరణలకు దూరంగా ఉండడం, చెరువుల్లో వ్యర్థాలు వేయకుండా చూడడం, నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత.

తెలంగాణ అస్తిత్వానికి బతుకమ్మ చిరునామా

తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కాలంలో బతుకమ్మ పండుగ ప్రజల సాంస్కృతిక గుర్తింపును బలంగా చాటింది. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రాంతీయ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచింది. నేడు రాష్ట్ర సరిహద్దులు దాటి దేశ విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు సైతం బతుకమ్మను ఘనంగా నిర్వహిస్తూ తమ మూలాలను గుర్తుచేసుకుంటున్నారు.

పూలను పేర్చడం నుంచి పాటలు పాడటం వరకు, పూజలు నిర్వహించడం నుంచి సద్దులు పంచుకోవడం వరకు ప్రతి ఆచారంలోనూ ఒక అంతరార్థం దాగి ఉంది. ప్రకృతిని గౌరవించడం, కుటుంబ బంధాలను కాపాడుకోవడం, సంప్రదాయాలను భావితరాలకు అందించడం అనే సందేశాన్ని బతుకమ్మ చాటుతోంది. సద్దుల బతుకమ్మ అంటే పూలతో పేర్చిన అందమైన ఆకృతి మాత్రమే కాదు.. అది తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవం, పల్లె సంస్కృతికి ప్రతిరూపం, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి నిదర్శనం. పూల పరిమళాలు వెదజల్లే ఈ పండుగ తరతరాల పాటు తెలంగాణ నేలపై సంస్కృతి సౌరభాలను విరజిమ్మాలని ఆకాంక్షిద్దాం.

రైతు భూమికి భరోసా.. పంటకు రక్షణ!

సీతారామ కాలువలకు పైపులు.. ఆయిల్‌పామ్ తోటల్లో కవర్డ్ కండక్టర్లు

సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి తుమ్మల కీలక భేటీ.. 9,767 ఎకరాల భూమి ఆదా, భూసేకరణ వ్యయంలో రూ.2,148.74 కోట్ల తగ్గింపునకు ప్రతిపాదన



ఖమ్మం/అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త):

రైతుల భూములకు రక్షణ కల్పించడంతో పాటు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ వ్యయాన్ని తగ్గించడం, ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్తు ప్రమాదాలను నివారించడం, గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అక్టోబర్ 16న రెండు వేర్వేరు లేఖలు అందజేశారు. సీతారామ ఎత్తిపోతల పథకం పంపిణీ కాలువలను సాంకేతికంగా అనుకూలమైన ప్రాంతాల్లో పైపుల వ్యవస్థగా మార్చాలని, ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్తు లైన్లను కవర్డ్ కండక్టర్లుగా మార్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి విధానం రూపొందించాలని కోరారు. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వకు తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పైపుల వ్యవస్థతో వేల ఎకరాలు ఆదా

సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా, ఖమ్మం నియోజకవర్గాల్లో 3,28,853 ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించడంతో పాటు మరో 3,45,534 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తంగా 6,74,387 ఎకరాలకు ప్రయోజనం చేకూర్చే ఈ పథకంలో పంపిణీ కాలువల నిర్మాణానికి అవసరమయ్యే భూసేకరణ ప్రధాన సమస్యగా మారుతోందని మంత్రి వివరించారు.

ప్రస్తుతం ఆమోదించిన కాలువల నిర్మాణానికి సుమారు 11,162 ఎకరాల భూమి అవసరమవుతుందని, ఎకరాకు సగటున రూ.22 లక్షల చొప్పున లెక్కిస్తే భూసేకరణకే దాదాపు రూ.2,455 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సాంకేతికంగా సాధ్యమైన ప్రాంతాల్లో తెరిచిన కాలువల స్థానంలో పైపుల ద్వారా నీటిని సరఫరా చేసే విధానాన్ని అమలు చేయాలని ప్రతిపాదించారు. ఈ విధానం అమలైతే భూసేకరణ అవసరం 11,162 ఎకరాల నుంచి 1,395 ఎకరాలకు తగ్గే అవకాశం ఉందని అంచనా వేశారు. తద్వారా సుమారు 9,767 ఎకరాల భూమి ఆదా కావడంతో పాటు భూసేకరణ వ్యయంలో రూ.2,148.74 కోట్ల వరకు తగ్గింపు సాధ్యమవుతుందని వివరించారు. ఇప్పటికే ఆయిల్‌పామ్ వంటి అధిక పెట్టుబడితో కూడిన పంటలు సాగు చేస్తున్న రైతుల భూములను సేకరించాల్సిన అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు.

నిర్మాణ వ్యయాలపైనా తగ్గింపు అంచనా

పైపుల వ్యవస్థను అమలు చేయడం వల్ల భూసేకరణతో పాటు కాలువల నిర్మాణానికి సంబంధించిన పనుల్లోనూ వ్యయాన్ని తగ్గించవచ్చని మంత్రి తెలిపారు. ప్రస్తుత అంచనాల ప్రకారం మట్టి పనులకు రూ.413.59 కోట్లు, సీసీ లైనింగ్‌కు రూ.523.02 కోట్లు, ఇతర క్రాస్ డ్రైనేజీ పనులకు రూ.1,078 కోట్లు అవసరమవుతున్నాయని వివరించారు. నిర్మాణ విధానంలో మార్పులతో సుమారు రూ.1,807.82 కోట్ల వరకు ఆదా చేసే అవకాశం ఉందని ప్రతిపాదనలో పేర్కొన్నారు.నీటిపారుదల శాఖ 157వ సాంకేతిక సలహా కమిటీ కూడా అనుకూలమైన ప్రాంతాల్లో పైపుల ఆధారిత పంపిణీ వ్యవస్థను చేపట్టాలని సూచించిన విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పైపుల ద్వారా నీటిని సరఫరా చేయడం వల్ల పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు నీటి వృథాను తగ్గించవచ్చని, ప్రాజెక్టు వ్యయం మరింత పెరగకుండా నియంత్రించే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్తు ప్రమాదాలకు చెక్

రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తున్న నేపథ్యంలో తోటల్లో విద్యుత్తు లైన్లు రైతులకు సమస్యగా మారుతున్నాయని తుమ్మల పేర్కొన్నారు. చెట్ల ఆకులు, కొమ్మలు విద్యుత్తు తీగలకు తగలడంతో సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని, కొన్ని సందర్భాల్లో విద్యుత్తు ప్రమాదాలు, అగ్నిప్రమాదాల ముప్పు పొంచి ఉంటోందని వివరించారు. దీనివల్ల రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల భద్రతకూ ప్రమాదం ఏర్పడుతోందని తెలిపారు.ఈ సమస్యకు పరిష్కారంగా ఆయిల్‌పామ్ తోటల్లోని 11 కేవీ బేర్ కండక్టర్ల స్థానంలో కవర్డ్ కండక్టర్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట తక్కువ వోల్టేజీ లైన్లకు ఏరియల్ బంచ్డ్ కేబుళ్లు వినియోగించాలని ప్రతిపాదించారు. దీనివల్ల విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు తగ్గడంతో పాటు ప్రమాదాల ముప్పును నివారించవచ్చని పేర్కొన్నారు.

కొత్త తోటల అనుమతులతోనే మార్పులు

కొత్తగా ఆయిల్‌పామ్ తోటల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చే సమయంలోనే విద్యుత్తు లైన్ల మార్పిడి అవసరాన్ని గుర్తించాలని మంత్రి సూచించారు. ఉద్యాన శాఖ వెబ్ పోర్టల్ ద్వారా వివరాలను సంబంధిత విద్యుత్తు పంపిణీ సంస్థలకు పంపించి, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అంచనాలు రూపొందించేలా విధానం ఉండాలని కోరారు.తోటలకు మంజూరయ్యే బడ్జెట్‌లోనే లైన్ల మార్పిడి వ్యయాన్ని చేర్చడంతో పాటు ఇప్పటికే ఉన్న విద్యుత్తు స్తంభాలు, ఇతర మౌలిక సదుపాయాలను సాధ్యమైనంతవరకు వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటికే సాగులో ఉన్న తోటల్లోనూ ఉద్యాన శాఖ, విద్యుత్తు పంపిణీ సంస్థలు సంయుక్తంగా సర్వే నిర్వహించి, ప్రాధాన్య క్రమంలో దశలవారీగా పనులు చేపట్టాలని ప్రతిపాదించారు.

దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వకు చర్యలు

దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేందుకు ఇసుక బస్తాలతో తాత్కాలికంగా నీటిని నిల్వ చేసే ప్రతిపాదనను మంత్రి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆనకట్టపై సుమారు ఒక మీటరు నుంచి మీటరున్నర ఎత్తు వరకు ఇసుక బస్తాలు ఏర్పాటు చేయడం ద్వారా దాదాపు ఒక టీఎంసీ నీటిని నిల్వ చేసే అవకాశం ఉందని వివరించారు.

సుమారు రూ.30 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టవచ్చని, నిల్వ చేసిన నీటిని సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మూడు జిల్లాలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు.

ఖమ్మం అభివృద్ధికి నిధులు కోరిన తుమ్మల

ఖమ్మం నియోజకవర్గంలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ, తాగునీటి పథకాలకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను ఆమోదించి, అవసరమైన నిధులు విడుదల చేయాలని తుమ్మల కోరారు. డిసెంబర్ 9న కల్లూరిగూడెం ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీతో పాటు ఖమ్మంలోని వెలుగుమట్ల గృహ నిర్మాణ నమూనా కాలనీని ప్రారంభించేందుకు రావాలని ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.ఖమ్మం నియోజకవర్గ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను త్వరగా పరిష్కరించి అర్హులకు స్థలాలు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

యాతాలకుంట టన్నెల్ పనులు వేగవంతం చేయాలి

యాతాలకుంట కుంట టన్నెల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి సత్తుపల్లి, వేంసూరు, అశ్వారావుపేట, దమ్మపేట మండలాలకు సాగునీరు, తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల కోరారు. ఈ ప్రాంతాల రైతులకు సాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

సీతమ్మసాగర్‌కు అనుమతులు.. జూలూరుపాడు టన్నెల్‌కు ప్రాధాన్యం

సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను త్వరగా పొందేలా చర్యలు తీసుకుని పనులు ప్రారంభించాలని తుమ్మల కోరారు. జూలూరుపాడు టన్నెల్ పనులను కూడా వీలైనంత త్వరగా ప్రారంభించి, సంబంధిత సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని వేగవంతం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

రైతుల భూములను కాపాడటం, సాగునీటి ప్రాజెక్టుల వ్యయాన్ని తగ్గించడం, విద్యుత్తు ప్రమాదాలను నివారించడం, గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవడం, ఖమ్మం నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ ప్రతిపాదనలు చేసినట్లు మంత్రి తుమ్మల వివరించారు. ప్రతిపాదనలు అమలైతే రైతులకు భూమి నష్టం తగ్గడంతో పాటు సాగునీటి పనులు వేగవంతమై, ప్రభుత్వ ప్రజాధనం ఆదా అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు

కోట మైసమ్మ ఆలయంలో అన్నపూర్ణ దేవిగా అమ్మవారి దర్శనం

నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు.. భక్తులతో కిటకిటలాడిన ఆలయం



తల్లాడ/అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): తల్లాడ పట్టణంలోని కోట మైసమ్మ తల్లి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు అమ్మవారు అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సతీష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి ఆలయాన్ని సందర్శించి కోట మైసమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

దేవీ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లగడపాటి నెహ్రూ, మాధవి దంపతులు, ఆలయ అర్చకులు సతీష్ శర్మ, మాజీ ఎంపీపీ సరికొండ లక్ష్మి పద్మావతి కుమారుడు లోకేశ్ రాజు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

యాతాలకుంటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



సత్తుపల్లి/అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామంలో శనివారం నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ హాజరై స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మృత్యువుకు ఎంత దగ్గరగా ఉన్నాం?

ప్రకృతిని చంపుతున్నాం.. మన వినాశనాన్ని మనమే కొని తెచ్చుకుంటున్నాం!

ప్రతి ఇంటికి రెండు మొక్కలు నాటాలి.. లేదంటే భావితరాలకు మిగిలేది మండే భూమే!



సత్తుపల్లి/అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): ప్రకృతిపై మనిషి చేస్తున్న దాడికి ప్రకృతి వేడి రూపంలో సమాధానం చెబుతోంది. చెట్లను నరుకుతున్నాం. అడవులను నాశనం చేస్తున్నాం.చెరువులను కబ్జా చేస్తున్నాం.. పచ్చదనాన్ని కనుమరుగు చేస్తున్నాం. చివరకు ఎండ తీవ్రత పెరిగిందని ఏసీలను ఆశ్రయిస్తున్నాం. కానీ మనకు నీడనిచ్చే చెట్లను కాపాడాలనే ఆలోచన మాత్రం రావడం లేదు. ప్రకృతిని నాశనం చేస్తూ చల్లదనాన్ని కోరుకోవడం ఎంతవరకు సమంజసం? ఇది మనల్ని మనమే ప్రశ్నించుకోవాల్సిన సమయం!

ఎండ మండుతోంది.భూమి వేడెక్కుతోంది!

వేసవి వచ్చిందంటే చాలు. ఉదయం నుంచే భానుడి భగభగలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, వడగాలులు ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో వేడి తీవ్రత మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో మనుషుల జీవనం మరింత కష్టతరమయ్యే ప్రమాదం ఉంది. అయితే భూమి త్వరలో 60 డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరుకుంటుందని చెప్పే ప్రచారాలను నిర్ధారిత శాస్త్రీయ వాస్తవాలుగా భావించకూడదు. ప్రమాదం తీవ్రతను గుర్తించడానికి అతిశయోక్తులు అవసరం లేదు.. మన కళ్లముందు కనిపిస్తున్న పర్యావరణ మార్పులే హెచ్చరిక!

ఏసీలు పెరుగుతున్నాయి. చెట్లు తగ్గుతున్నాయి!

ఎండ నుంచి తప్పించుకోవడానికి ఏసీలు, ఇతర చల్లదనపు పరికరాలపై ఆధారపడుతున్నాం. వాటి వినియోగంతో విద్యుత్ అవసరం పెరుగుతోంది. ఏసీల నుంచి వెలువడే వేడి కూడా పరిసరాల ఉష్ణోగ్రతలను ప్రభావితం చేయవచ్చు. కానీ చెట్లు ఇచ్చే సహజమైన నీడను, చల్లదనాన్ని ఏ యంత్రం పూర్తిగా భర్తీ చేయలేదు. ఒకవైపు చెట్లను నరికివేసి, మరోవైపు పెరుగుతున్న వేడిని తగ్గించేందుకు యంత్రాలపై ఆధారపడటం మనిషి చేస్తున్న అతిపెద్ద తప్పిదాల్లో ఒకటి.

చెట్టు నరికితే.మనిషి మనుగడకే దెబ్బ!

చెట్టు అంటే కేవలం కర్ర కాదు. అది ప్రాణవాయువుకు ఆధారం, పక్షులకు నివాసం, భూమికి రక్షణ, మనిషికి నీడ. చెట్లు కార్బన్ డైఆక్సైడ్‌ను గ్రహిస్తాయి. నేల కోతను తగ్గిస్తాయి. వర్షపు నీరు భూమిలోకి ఇంకేందుకు సహకరిస్తాయి. అయినా అభివృద్ధి పేరుతో పచ్చదనాన్ని తొలగిస్తే రేపటి తరాలకు స్వచ్ఛమైన గాలి, చల్లని వాతావరణం ఎక్కడి నుంచి వస్తాయి? ప్రకృతిని కాపాడకుండా మనిషి మనుగడను కాపాడుకోవడం అసాధ్యం.

ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటాల్సిందే!

ఇది ప్రభుత్వాలకే పరిమితమైన బాధ్యత కాదు.ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత. ప్రతి ఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటాలని సంకల్పించాలి. ఇంటి ఆవరణలో, పాఠశాలల్లో, కార్యాలయాల వద్ద, అందుబాటులో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో వేప, చింత, రావి వంటి స్థానిక వృక్ష జాతులను నాటాలి. అయితే మొక్క నాటిన ఫొటో తీసుకొని ప్రచారం చేసుకోవడం కాదు ముఖ్యం.ఆ మొక్క బతికి చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించడమే అసలైన బాధ్యత.

మొక్క నాటడం ఆరంభం.. బతికించడం అసలైన విజయం!

మొక్కకు నీరు పోయాలి. పశువుల నుంచి రక్షించేందుకు కంచె వేయాలి. ఎండాకాలంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. నాటిన మొక్క ఎండిపోయిందా, బతికిందా అని పరిశీలించాలి. ప్రతి గ్రామంలో ప్రజలు, యువత, విద్యార్థులు కలిసి మొక్కల సంరక్షణకు పూనుకోవాలి. ప్రభుత్వాలు కూడా మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణపై దృష్టి పెట్టాలి.

ఇప్పటికైనా మారకపోతే. రేపు పశ్చాత్తాపమే మిగులుతుంది!

ప్రకృతి మనకు ఇచ్చిన సంపదను మనమే నాశనం చేసుకుంటూ, రక్షణ కోసం ఇతర మార్గాలను వెతకడం ఎంతకాలం సాధ్యం? మన పిల్లలకు కాంక్రీటు భవనాలు, మండే రహదారులు, వేడెక్కిన వాతావరణం మాత్రమే వారసత్వంగా ఇవ్వాలా? లేక పచ్చని చెట్లు, స్వచ్ఛమైన గాలి, జీవించడానికి అనువైన భూమిని అందించాలా? నిర్ణయం మన చేతుల్లోనే ఉంది.

ఏసీ చల్లదనం తాత్కాలిక ఉపశమనం మాత్రమే. చెట్టు ఇచ్చే నీడ తరతరాలకు ఉపయోగం. ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే దాని పరిణామాలను మనమే ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే ఇక మాటలు వద్దు.చేతల్లో పర్యావరణ పరిరక్షణ చూపిద్దాం.ఈ రోజే రెండు మొక్కలు నాటండి. వాటిని బతికించండి.పది మందికి ఆదర్శంగా నిలవండి.

ప్రతి ఇంటికి రెండు మొక్కలు.ప్రతి గ్రామానికి పచ్చని కవచం.ప్రతి తరానికి ఆరోగ్యకరమైన భవిష్యత్తు!

ప్రకృతిని కాపాడుకుందాం. మనిషి మనుగడను నిలబెట్టుకుందాం!

శ్రీ మహాలక్ష్మి దేవి అవతారంలో దుర్గామాత దర్శనం



స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): మండలంలోని తాటికొండ గ్రామంలో కొలువుదీరిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శనివారం దుర్గామాత అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.అర్చకుడు జీడికంటి వరుణాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకం, జలాభిషేకం నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, నవగ్రహ పూజ, అర్చన, హోమం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం కుంకుమ పూజ, అర్చన కార్యక్రమాలు చేపట్టారు.అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో పండగ బుచ్చయ్య, అర్చకుడు జీడికంటి వరుణాచార్యులు, భవాని మాల స్వాములు పండగ రాజేశ్వర్, పర్శ రాజు, పండుగ సత్తయ్య, పండుగ రవి, అక్కెనపల్లి రాములు, మారపాక నాగరాజు, అక్కెనపల్లి రాకేష్, శ్రీపతి రాజు, నారబోయిన కార్తీక్, చిలువేరు వర్షిత, మొగ్గం ప్రవస్థి, మారపాక మానస (సుబ్బులు)తో పాటు పలువురు భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే మా లక్ష్యం

147 మంది పాల ఉత్పత్తిదారులకు దసరా కానుకగా నగదు పంపిణీ



జనగామ/బచ్చన్నపేట, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): పాల ఉత్పత్తిదారుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధే తమ లక్ష్యమని జనగామ జిల్లా విజయ డైరీ మేనేజర్ డాక్టర్ నరేష్ యాదవ్ అన్నారు. శనివారం బచ్చన్నపేట మండల కేంద్రంలో దసరా పండుగ సందర్భంగా 147 మంది పాల ఉత్పత్తిదారులకు కానుకగా నగదు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ యాదవ్ మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులు ఆర్థికంగా బలోపేతం కావడానికి పలు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పాడి పశువులకు జీవిత బీమా సౌకర్యం కల్పించడంతో పాటు పాడి పశువుల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించేలా కృషి చేస్తున్నట్లు వివరించారు. పాడి రైతుల అభ్యున్నతికి విజయ డైరీ కృషి చేస్తుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో డైరీ చైర్మన్ ఆంజనేయులు, పర్యవేక్షకుడు శ్రీనివాస్ రెడ్డి, పాల ఉత్పత్తిదారులు కరుణాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సత్తిరెడ్డి, బండారి రాములు, ఆగయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యుల రెండో విడత శిక్షణ తరగతులు పూర్తి

గ్రామపంచాయతీ విధులు, బాధ్యతలపై అవగాహన



జనగామ/చేర్యాల, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామపంచాయతీ వార్డు సభ్యుల రెండో విడత శిక్షణ తరగతులు ముగిశాయి. చేర్యాల మండలంలోని ముత్యాల రైతు వేదికలో అక్టోబర్ 10 నుంచి 16 వరకు ఐదు రోజులపాటు ఈ శిక్షణ తరగతులను నిర్వహించారు.ఈ శిక్షణలో గ్రామపంచాయతీ చట్టం ప్రకారం వార్డు సభ్యుల విధులు, బాధ్యతలు, గ్రామసభల నిర్వహణ, ఆర్థిక వ్యవహారాలు, రికార్డుల నిర్వహణ, సామాజిక తనిఖీ తదితర అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. శిక్షకులుగా కే. వినోద్, ఎం.డి. గౌస్, రవీందర్ రెడ్డి వ్యవహరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వార్డు సభ్యులకు ధ్రువపత్రాలను అందజేశారు.ఈ శిక్షణలో కొత్త దొమ్మాట, ముత్యాల, నాగపురి, పెద్దరాజుపేట, శభాష్‌గూడెం, తాడూరు, వేర్వేరు గ్రామాలతో పాటు వీరన్నపేట తదితర గ్రామాలకు చెందిన మొత్తం 92 మంది వార్డు సభ్యులు పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్నారు.

అనారోగ్య బాధితుడికి ఎమ్మెల్యే నాగరాజు ఆర్థిక సాయం





వర్ధన్నపేట/అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇల్లంద గ్రామానికి చెందిన కార్తిక్‌కు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆర్థిక సహాయం అందించారు. మెరుగైన వైద్యం అందేలా చొరవ తీసుకుని, కోలుకుని ఇంటికి చేరిన యువకుడిని పరామర్శించి కుటుంబానికి భరోసా కల్పించారు.మంద మల్లేశంరాధిక దంపతుల కుమారుడైన కార్తిక్ హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, ఆసుపత్రికి వెళ్లి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు. ప్రస్తుతం కోలుకున్న కార్తిక్‌ను ఇంటి వద్ద పరామర్శించి, పూర్తిస్థాయిలో ఆరోగ్యం మెరుగుపడే వరకు అవసరమైన వైద్య సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యేకు కార్తిక్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోశాల వెంకటేశ్వర్లు, ఆలయ చైర్మన్ బుచ్చిమల్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సమ్మయ్యగౌడ్, మల్లెపాక సమ్మయ్య, సాయిలు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాగరాజు గారూ..

రోడ్డేయించండి సారూ!

దాదాపు రెండేళ్లుగా కంకర రోడ్డే దిక్కు.. ప్రజల ప్రయాణ కష్టాలపై స్పందించరా?

ఇల్లందచంద్రు తండా మార్గంలో ప్రయాణ కష్టాలు

వర్ధన్నపేట/అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త):
ప్రజల రాకపోకలకు సౌకర్యం కల్పించాల్సిన రహదారి అసంపూర్తిగా మిగిలిపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద నుంచి చంద్రు తండా వైపు వెళ్లే రహదారి పనులు దాదాపు రెండేళ్లుగా పూర్తికాలేదు. కంకర పోసి వదిలేయడంతో గుంతలు, దుమ్ము, బురద మధ్య ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల ప్రజలకు ఇక్కట్లు

ఇల్లంద, కుమారి గూడెం, నల్లబెల్లి, చంద్రు తండా, రాందాస్ తండా, ముడుగుల్ల తండా, రోలకల్ ప్రాంతాల ప్రజలకు రహదారి సమస్య ఇబ్బందిగా మారిందని స్థానికులు చెబుతున్నారు. రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాల్సి వస్తోందని, వర్షాకాలంలో రాకపోకలు మరింత కష్టంగా మారుతున్నాయని పేర్కొంటున్నారు.

పనుల నిలిపివేతపై స్పష్టత ఏదీ?

కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతోనే పనులు నిలిచిపోయాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై అధికారిక నిర్ధారణ లేదు. పనులు



నిలిచిపోవడానికి అసలు కారణాలను సంబంధిత అధికారులు వెల్లడించాల్సి ఉంది. నిధులు, బిల్లులు లేదా కాంట్రాక్టు పరమైన సమస్యలు ఉంటే నిబంధనల ప్రకారం పరిష్కరించి పనులు కొనసాగించాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ పనుల పురోగతిని పర్యవేక్షించడం, నాణ్యతను నిర్ధారించడం, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడడం సంబంధిత అధికారుల బాధ్యత. నిర్మాణం దీర్ఘకాలం అసంపూర్తిగా ఉండటంతో పనుల ప్రస్తుత స్థితి, పూర్తికి తీసుకుంటున్న చర్యలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు రహదారి సమస్యపై దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత అధికారులతో సమీక్షించి పనులు నిలిచిపోవడానికి కారణాలను గుర్తించి, నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అప్పటివరకు రాకపోకలకు ఆటంకం కలగకుండా తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని అభిప్రాయపడుతున్నారు.

ప్రజా సౌకర్యమే ప్రాధాన్యం

ప్రజా అవసరాల కోసం చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉండటం వల్ల ప్రజాధనం వినియోగం, పనుల పర్యవేక్షణపై సహజంగానే సందేహాలు తలెత్తుతాయి. సంబంధిత శాఖ అధికారులు వాస్తవ పరిస్థితిని వెల్లడించి, పనుల పూర్తికి కార్యాచరణ ప్రకటించాలి. ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారమై రహదారి అందుబాటులోకి వస్తుందని స్థానికులు ఆశిస్తున్నారు.

పండుగ వేళా తప్పని ప్రయాణ కష్టాలు

బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సొంతూళ్లు, తండాలకు వెళ్లే ప్రజలకు ఈ రహదారి దుస్థితి మరింత ఇబ్బందిగా మారుతోంది. పండుగల వేళ రాకపోకలకు ఆటంకం లేకుండా అధికారులు తక్షణ మరమ్మతులు చేపట్టి, శాశ్వత పరిష్కారంగా రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళా ఉద్యోగుల బతుకమ్మ సంబరాలు



పర్వతగిరి/అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని డిప్యూటీ తహసీల్దార్ హరిత అన్నారు. శనివారం పర్వతగిరిలోని మదర్ థెరిస్సా మహిళా మండల సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొని మహిళలతో కలిసి ఆటపాటలతో సందడి చేశారు. తొమ్మిది రోజులపాటు పూలను గౌరమ్మగా పూజిస్తూ మహిళలు ఐక్యత, సోదరభావాన్ని చాటుకోవడం బతుకమ్మ పండుగ ప్రత్యేకతని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో ఆంజనేయులు, ఏపీఎం రాజిరు, సమాఖ్య ప్రతినిధులు స్వప్న, రజిత, ఫరీదా, సీనియర్ అసిస్టెంట్ సృజన, సీసీలు కొమురయ్య, సుధాకర్, శాంసన్, దేవేంద్ర, సిబ్బంది, వివిధ గ్రామాల గ్రామైక్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పి.ఆర్.టి.యు. టీఎస్ రాష్ట్ర సహాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు గౌడ్



జనగామ/చేర్యాల, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త): పి.ఆర్.టి.యు. తెలంగాణ రాష్ట్ర సహాధ్యక్షుడిగా చేర్యాల మండలం దొమ్మాట ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న అనగాని వెంకటేశ్వర్లు గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి బాధ్యతలు అప్పగించడంపై వెంకటేశ్వర్లు గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్రస్థాయి బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్సీ శ్రీపాల్, అధికార ప్రతినిధి మహేందర్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి భిక్షంగౌడ్, చేర్యాల మండల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు సహకరించిన నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

జనవరి నెలకు తిరుమల శ్రీవారి దర్శనం

అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త):
తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనం కోసం ఎదురుచూసే భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక సమాచారం అందించింది. 2027 జనవరి నెలకు సంబంధించిన వివిధ దర్శనాలు, ఆర్జిత సేవలు, వసతి గదుల ఆన్‌లైన్ కోటాను విడుదల చేసేందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ప్రకటించింది. భక్తులు తమ ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకునేందుకు వీలుగా ఈ వివరాలను టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి కార్యాలయం శనివారం విడుదల చేసింది. అక్టోబర్ 19వ తేదీ నుంచి పలు తేదీల్లో దశలవారీగా ఈ టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నారు.అక్టోబర్ 19 – ఆర్జిత సేవా టికెట్లు (ఎలక్ట్రానిక్ డిప్): జనవరి నెలకు సంబంధించిన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవా టికెట్లకు ఎలక్ట్రానిక్ లక్కీ డిప్ ప్రక్రియ అక్టోబర్ 19న ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. భక్తులు అక్టోబర్ 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. లక్కీ డిప్‌లో టికెట్లు పొందిన భక్తులకు సమాచారం

బొజ్జగూడెం తండాలో
వైభవంగా కుంకుమ పూజలు



అనంతగిరి, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త):
అనంతగిరి మండల పరిధిలోని పలు గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బొజ్జగూడెం తండా గ్రామంలో మహిళలకు కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తిని చాటుకున్నారు.ఈ సందర్భంగా పురోహితులు మాట్లాడుతూ.. వివాహిత మహిళలు తమ ముత్తైదువతనం కలకాలం నిలవాలని, భర్త ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తూ కుంకుమార్చన చేస్తారని తెలిపారు. లలితా సహస్రనామాలు, దేవి అష్టోత్తరాలు పఠిస్తూ అమ్మవారి పాదపద్మాలకు కుంకుమ సమర్పించడం భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను కలిగిస్తుందని వివరించారు.పూజలో సమర్పించిన కుంకుమను నుదుట ధరించడం శుభప్రదంగా భావిస్తారని అమ్మవారి అనుగ్రహంతో సుఖసంతోషాలు కలగాలని భక్తులు ఆకాంక్షిస్తారని పేర్కొన్నారు. శరన్నవరాత్రుల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

గ్రామపంచాయతీ సిబ్బందికి
రూ.15 లక్షల ప్రమాద బీమా

వార్డు సభ్యులకూ వ్యక్తిగత ప్రమాద బీమా కల్పిస్తున్న ఎన్నారై రవి ఫౌండేషన్



పాలారం, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాలారం గ్రామపంచాయతీ సిబ్బందికి రూ. 15 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా కల్పించే కార్యక్రమాన్ని శనివారం పాలారం పోస్టాఫీసులో ప్రారంభించారు.గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రమాద బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మట్టపల్లి నరేష్, గ్రామ కార్యదర్శి వెంకటేష్, ఎన్నారై రవి ఫౌండేషన్ చైర్మన్ బెల్లంకొండ రవి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మట్టపల్లి రామకోటయ్య, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.వార్డు సభ్యులకూ ప్రమాద బీమా గ్రామపంచాయతీ సిబ్బందితో పాటు గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న వార్డు సభ్యులకు కూడా వ్యక్తిగత ప్రమాద బీమా కల్పించేందుకు ఎన్నారై రవి ఫౌండేషన్ చైర్మన్ బెల్లంకొండ రవి ముందుకొచ్చారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలోని వార్డు సభ్యులందరికీ వ్యక్తిగత ప్రమాద బీమా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.గ్రామస్థాయిలో ప్రజలకు సేవలందించే సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు ప్రమాద బీమా భద్రత కల్పించే ఈ కార్యక్రమం ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామ సిబ్బంది, వార్డు సభ్యులకు భరోసా కల్పించేలా చేపట్టిన ఈ చర్యపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పండుగల వేళ
మద్యం విక్రయాల జోరు..
నిఘా ఏది?



వర్ధన్నపేట/అక్టోబరు 17 (జర్నలిస్టు వార్త):
బతుకమ్మ. దసరా. పండుగల సందడి మధ్య మద్యం విక్రయాలపై ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. వర్ధన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, కొన్ని కిరాణా దుకాణాల్లోనూ అమ్మకాలు జరుగుతున్నాయనే ప్రచారం వినిపిస్తోంది. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఫిర్యాదులూ వస్తున్నాయి. ఈ ఆరోపణలే నిజమైతే నిబంధనలను పర్యవేక్షించాల్సిన ఎక్సైజ్ శాఖ ఏం చేస్తోంది? గ్రామస్థాయిలో తనిఖీలు జరుగుతున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
వర్ధన్నపేట మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీల్లో మద్యం విక్రయాలు నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నాయా లేదా అన్నది తేలాల్సి ఉంది. కిరాణా దుకాణాల్లో మద్యం అమ్ముతున్నారనే ప్రచారంపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి. అనుమతులు లేని చోట విక్రయాలు జరుగుతున్నాయా? నిబంధనలకు విరుద్ధంగా మద్యం నిల్వలు ఉంచుతున్నారా? అన్న అంశాలను పరిశీలించాలి. కేవలం ఆరోపణలు వినిపిస్తున్నాయనే కారణంతో ఎవరినీ దోషులుగా నిర్ధారించలేం. అదే సమయంలో ఫిర్యాదులను విస్మరించడం కూడా ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమే.
కొన్ని చోట్ల మద్యం సీసాలపై ముద్రించిన గరిష్ఠ చిల్లర ధర కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వినియోగదారుల నుంచి వస్తున్నాయి. కొనుగోలుదారులకు సరైన బిల్లులు అందుతున్నాయా? నిర్ణీత ధరలకే విక్రయాలు జరుగుతున్నాయా? అన్న అంశాలపై తనిఖీలు అవసరం. అధిక ధరలకు విక్రయించినట్లు ఆధారాలతో తేలితే సంబంధితులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.
పండుగల సమయంలో ప్రజల రద్దీ పెరుగుతుంది. ఈ సమయంలో మద్యం విక్రయాలపై పర్యవేక్షణ మరింత పటిష్ఠంగా ఉండాలి. గ్రామాల్లో అనధికార విక్రయాలు, అధిక ధరలపై ఆరోపణలు వినిపిస్తున్నప్పుడు అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన బాధ్యత ఉంది. తనిఖీలు నిర్వహించారా? ఉల్లంఘనలు గుర్తించారా? ఫిర్యాదులపై ఏ చర్యలు తీసుకున్నారు? అన్న వివరాలను ప్రజలకు తెలియజేయాలి.
మద్యం విక్రయాలపై ఆరోపణలు రావడం ఒక అంశమైతే.వాటిపై అధికారుల స్పందన మరో అంశం. ఆరోపణలు నిజమో కాదో తేల్చాల్సింది ప్రచారం కాదు. క్షేత్రస్థాయి విచారణ. వర్ధన్నపేట మండలంలో ఎక్సైజ్ శాఖ తనిఖీలు నిర్వహించి, వాస్తవాలను వెల్లడించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటుందా? అన్నది వేచి చూడాలి.





ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం కుప్పకూలిపోయింది..
కత్తులు, కర్రలతో మా వాళ్లను వెంటాడుతున్నారు: జగన్



అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త):

ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం పూర్తిగా కుప్పకూలిపోయిందని, ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార తెలుగుదేశం పార్టీ హింసకు పాల్పడుతోందని ఆరోపిస్తూ, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు తన పార్టీ కార్యకర్తలకు గూండా లైసెన్స్‌లు ఇచ్చి, వారికి అండగా పోలీసు యంత్రాంగాన్ని వాడుకుంటున్నారని జగన్ ఆరోపించారు. “రాజకీయ హింసావాదిగా తన చరిత్రను మరోసారి చాటుకుంటూ రాష్ట్రంలో జంగిల్‌రాజ్‌ను నడిపిస్తున్నారు. ప్రతిపక్ష అభ్యర్థులు కనీసం నామినేషన్లు కూడా వేయలేని దుస్థితి సృష్టించారు“ అని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు. వైసీపీ అభ్యర్థులను పోలీసుల సమక్షంలోనే కత్తులు, కర్రలతో వెంటాడుతున్నారని, నామినేషన్ పత్రాలను లాక్కుని చించివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వేళ అభ్యర్థులను పోలీసులు అక్రమంగా ఎత్తుకెళుతున్నారని, ఇదే చంద్రబాబు మార్కు ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు.ఈ దాడుల్లో తమ పార్టీకి చెందిన ముగ్గురు ఎంపీలు కూడా బాధితులయ్యారని జగన్ తెలిపారు. అభ్యర్థులకు ప్రపోజర్లుగా వెళ్లిన ఎంపీలపై పోలీసుల సమక్షంలోనే దాడులు జరిగాయని, వారి చేతుల్లోంచి నామినేషన్ పత్రాలు లాక్కుని చించేశారని వివరించారు. “ఎంపీలకే రక్షణ లేని రాష్ట్రంలో సామాన్యుల పరిస్థితి ఏమిటి?“ అని నిలదీశారు. కడప, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, రాయచోటి, పుంగనూరు, తిరుపతి, దర్శి, గురజాల సహా రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, ఇవి చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం ఎంతగా దిగజారిపోయిందో చూపుతున్నాయని అన్నారు.పులివెందులలో పోలీసులు జరిపిన కాల్పులు ప్రజాస్వామ్యంపై పేల్చిన తూటాలని, దీని వెనుక చంద్రబాబు కుట్ర ఉందని జగన్ ఆరోపించారు. నామినేషన్ వేయడానికి వచ్చిన వారిపై పోలీసులు ఎందుకు దాడి చేశారని, ఎందుకు కాల్పులు జరిపారని ప్రశ్నించారు. “నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడం ఎన్నికలా? ప్రతిపక్ష అభ్యర్థులను పోలీసులతో ఎత్తుకెళ్లడం ప్రజాస్వామ్యమా? ఎంపీలపైనే దాడులు చేయించడం రాజ్యాంగ పాలనా?“ అని చంద్రబాబును ఉద్దేశించి జగన్ ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ఈ పరిస్థితుల్లో కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. “సూపర్ 6, సూపర్ 7ల మోసాలతో ప్రజలకు బాండ్లు ఇచ్చి మరీ మోసం చేసిన ఈ వెన్నుపోటు పార్టీ నుంచి ఇంతకన్నా ఏమి ఆశించగలం!“ అని జగన్ తన పోస్టును ముగించారు

టీడీపీ మూడో జాబితా విడుదల..

పురపోరుకు టీడీపీ అభ్యర్థుల ఎంపిక
మరో 12 మంది పేర్లు ఖరారు
జాబితాలో 10 మంది మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థులు
ఇప్పటివరకు మూడు జాబితాల్లో కలిపి 70 మంది అభ్యర్థుల ప్రకటన

అక్టోబర్ 17 (జర్నలిస్ట్ వార్త):
ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల కోసం తెలుగుదేశం పార్టీ (టీడీపీ) అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసింది. పురపోరులో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులను ఖరారు చేస్తున్న ఆ పార్టీ, శనివారం నాడు మూడో జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో రెండు కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులను, 10 మున్సిపాలిటీలకు చైర్‌పర్సన్ అభ్యర్థులను ప్రకటించింది.తాజా జాబితా ప్రకారం, కీలకమైన గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, ఒంగోలు కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా నల్లమల్లి శ్రీ శిల్ప పేరును టీడీపీ అధిష్ఠానం ఖరారు చేసింది.
10 మున్సిపాలిటీలకు చైర్‌పర్సన్ అభ్యర్థులుఈ జాబితాలో 10 మున్సిపాలిటీలకు చైర్‌పర్సన్ అభ్యర్థులను కూడా పార్టీ ప్రకటించింది.

నిధి అన్వేషణలో 'వృషకర్మ'



అగ్ర కథానాయకుడు నాగచైతన్య నటిస్తున్న మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ'. మీనాక్షి చౌదరి కథానాయిక. కార్తీక్ దండు దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్‌తో కలిసి అగ్ర దర్శకుడు సుకుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ గురువారం మేకర్స్ ఓ ప్రకటనను విడుదల చేశారు.విడుదలకు ఇంకా 50రోజులు మాత్రమే సమయం ఉండటంతో ఓ సరికొత్త పోస్టర్‌ని కూడా విడుదల చేశారు.స్టైలిష్‌గా, యాక్షన్ అవతార్‌లో పదునైన కత్తులు అమర్చబడ్డ ఓ లోహపు తాడును ఆయుధంగా చేతబట్టి కనిపిస్తున్న నాగచైతన్యను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఆయన చుట్టూ ఉన్న వాతావరణం తుఫానుని తలపిస్తున్నది.నిధి అన్వేషణ నేపథ్యంలో మైథాలజీ, అడ్వెంచర్ అంశాలతో.. ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో భారీ స్థాయిలో ఈ సినిమా తెరకెక్కుతున్నదని మేకర్స్ తెలిపారు. నాగచైతన్య కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు ప్రీరిలీజ్ బిజినెస్ కూడా భారీగా జరిగిందని మేకర్స్ చెప్పారు. స్పర్ష్ శ్రీవాస్తవ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాగుల్ డి.హెరియన్, సంగీతం: అజనీష్ బి.లోక్‌నాథ్, సమర్పణ: బాపినీడు, నిర్మాణం: శ్రీవెంకటేశ్వర సినీచిత్ర, సుకుమార్ రైటింగ్స్.



గరివిడి లక్ష్మిగా నటించినందుకు గర్వపడుతున్నా

ఏపీకి చెందిన ప్రముఖ జానపద గాయని గరివిడి లక్ష్మి జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'గరివిడి లక్ష్మి'. టైటిల్‌రోల్‌లోని ఆనంది పోషించింది. గౌరినాయుడు జమ్ము దర్శకుడు. పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈచిత్రం ఈ నెల 17న విడుదల కానున్నది.ఈ సందర్భంగా వైజాగ్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ని మేకర్స్ నిర్వహించారు. కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఏపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, హీరో తేజా సజ్జా, డైరెక్టర్ మోహన్‌రాజా ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు.విజయశాంతికి 'కర్తవ్యం', సౌందర్యకు 'అమ్మోరు', అనుష్కకు 'అరుంధతి', కీర్తిసురేశ్‌కు 'మహానటి ఎలాగో ఆనందికి 'గరివిడి లక్ష్మి' అలా నిలుస్తుందని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ నమ్మకంగా చెప్పారు. 'గరివిడి లక్ష్మి' పాత్ర చేసినందుకు గర్వంగా ఉందని నటి ఆనంది చెప్పారు. ఇంకా దర్శకుడు గౌరీనాయుడు జమ్ము, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ కూడా మాట్లాడారు.



చందమామ కథలా 'కరికాల'

సందీప్‌కిషన్ కథానాయకుడిగా రూపొందుతున్న సోషియో ఫాంటసీ చిత్రం 'కరికాల'. కేథరిన్ థ్రెసా, గాయత్రి భరద్వాజ్, సాక్షి మడోల్కర్ కథానాయికలు. యుగంధర్ ముని దర్శకత్వంలో రెండు భాగాలుగా ఈ చిత్రం తెరకెక్కనున్నది. తొలిభాగాన్ని వచ్చే ఏడాది జూలై 2న, మలిభాగాన్ని వచ్చే ఏడాది అక్టోబర్ 28న విడుదల చేయనున్నారు.మహిధర్‌రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మాతలు. ఈ సినిమా పూజా కార్యక్రమాలు గురువారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. నిర్మాత రాజశేఖర్ అన్నభీమోజు తల్లి సత్యవతి కెమెరా స్విచాన్ చేయగా, మరో నిర్మాత మహిధర్‌రెడ్డి తల్లి పద్మారెడ్డి క్లాప్ కొట్టారు. తొలి సన్నివేశాన్ని ఆది సాయికుమార్ గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత రాజశేఖర్ తండ్రి వీరభద్రాచారి స్క్రిప్ట్‌ని అందజేశారు. అతిథులంతా సినిమా బాగా రావాలని శుభాకాంక్షలు అందించారు. 'ఈ సినిమా రెండు పార్టులకు సంబంధించిన కథ దర్శకుడు వివరించాడు.అయితే.. ఒక్కనిమిషం కూడా బోర్ అనిపించలేదు. గత ఆరేడు నెలలుగా ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి దర్శక,నిర్మాతలు దొరకడం నా అదృష్టం. నాకెరీర్‌లోనే 'కరికాల' బెస్ట్ సినిమా అవుతుంది' అని సందీప్‌కిషన్ చెప్పారు. ఈ ఫ్రాంచైజీ ఓ చందమామ కథలా ఉంటుందని దర్శకుడు యుగంధర్ తెలిపారు. ఇంకా నిర్మాతలు, కథానాయికలు, సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల కూడా మాట్లాడారు.



న్యాయవాది పాత్రలో సునీల్

కామెడీతో పాటు పవర్‌ఫుల్ విలనిజాన్ని ప్రదర్శిస్తూ ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నారు నటుడు సునీల్. తాజాగా ఆయన లాయర్‌గా విభిన్నమైన పాత్రలో కనిపించబోతున్నారు. 'డ్యూ డేట్' సినిమాలో సునీల్ ఈ పాత్రను పోషిస్తున్నారు. లోమేష్ పుడిపెద్ది హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి ఆనంద్ కె దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ తరిగోపుల, ఏలూరు శ్రీను నిర్మాతలు.ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతున్నది. నేటి సమాజంలోని ఓ బర్నింగ్ ఇష్యూని కథా వస్తువుగా తీసుకొని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, కోర్ట్‌రూమ్ డ్రామాగా ఆకట్టుకుంటుందని, సునీల్ పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. జయశ్రీ, ప్రణీత పట్నాయక్, కృష్ణభగవాన్ తదితరులు చిత్ర తారాగణం.



వాటి గురించి ఇప్పుడే చెప్పలేను

సాధారణంగా ఎక్కువమంది హీరోయిన్లు 'మేం తింటాం కానీ వంట చేయలేం' అంటుంటారు. కానీ శ్రీలీల మాత్రం ఎలాంటి వంటనైనా ఈజీగా చేసేస్తానంటున్నది. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో తనలోని పాకశాస్త్ర నైపుణ్యం గురించి శ్రీలీల మాట్లాడింది. 'నాకు సాంబారు, కొబ్బరన్నం, కుర్మాకూర.. ఇలా చాలా వంటలు వచ్చు. అయితే.. ఎలాంటి వెరైటీ వండినా.. పెరుగన్నం మాత్రం నా మెనూలో పక్కగా ఉండాల్సిందే.చిన్నప్పట్నుంచీ పెరుగన్నమంటే చాలా ఇష్టం' అని శ్రీలీల పేర్కొన్నారు. సినిమాల్లో ఎక్కువగా కనిపించడం లేదేంటి? అనడిగితే.. 'గత కొన్ని రోజులుగా షూటింగులతో బిజీగా ఉన్నాను. నేను చేస్తున్న సినిమాలకు చెందిన వివరాల గురించి యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించలేదు. అందుకే ఆ సినిమాల గురించి నేను ఇప్పుడే చెప్పలేను. ప్రస్తుతానికైతే రెండ్రోజులు బ్రేక్ దొరికింది. ఈ విలువైన సమయాన్ని ఫ్యామిలీతో స్పెండ్ చేస్తున్నా' అంటూ చెప్పుకొచ్చారు శ్రీలీల.